కథ

# బతుకు తెరువు

''అమ్మా ఆకలేస్తోందే'' చింటూ అరుంధతి కళ్ల లోకి చూస్తూ దీనంగా అడుగుతున్నాడు.

గుండె తరుక్కుపోయింది అరుంధతికి. కళ్లలో నీరు ఉబికి వచ్చింది. రాత్రి మిగిలిన అన్నం పళ్లెంలో పెట్టి నీళ్లమజ్జిగ పోసి కలిపింది. రుచి కోసమని కాస్త ఉప్పు వేసింది.

ఆవురావురుమంటూ తింటున్నాడు వాడు. ముద్దముద్దకీ ఆకలి ఎక్కువవుతోందేమో అనిపించేట్టు ఆబగా తింటున్నాడు.

ఆకలంటే ఏమిటో తెలియని బిడ్డ. కమ్మటి గడ్డపెరుగు వేసి కలిపినా సగం తిని ఇంక వద్దని మారాం చేసేవాడు. ఇప్పుడు నీళ్లమజ్జిగే వాడికి పరమాన్నమయింది.

''అమ్మా! ఇంకాస్త పెట్టవూ...'' ఆకలి తీరలేదు కాబోలు...

గుప్పెడు మెతుకులు వాడి ఆకలిని తీర్చలేవని తెలుసు అరుంధతికి. ఆమె ఇక ఆగలేకపోయింది. చింటూని గుండెలకి హత్తుకుని పైకే ఏడ్చేసింది.

తల్లి ఏడవడం చూసి వాడూ బిక్కమొహం వేశాడు.

భర్త యాక్సిడెంట్‌లో చనిపోయిన తరువాత ఈ ఆర్నెల్లూ ఎలాగో గడిపింది ఇంట్లో మిగిలిన డబ్బులతో. బియ్యం నిండుకున్నాయి. ఓ కిలో బియ్యం కొనాలన్నా డబ్బు లేదిప్పుడు.

ఈ ప్రపంచంలో తనే ఓ దిక్కులేనిదైతే తన మీదే ఆధారపడిన మరో ప్రాణి. కొడుకుని చూస్తూంటే అరుంధతికి దుఃఖం ఎక్కువైంది.

తనూ తన భర్త రాఘవా తమ బిడ్డని రాజకుమారుడిలా పెంచాలనుకున్నారు. వాడిని పెద్ద చదువులు చదివించి గొప్పవాడిని చెయ్యాలనుకున్నారు. రాఘవ కళ్లనిండా కొడుకును గురించిన ఆశలే. వాడికి చిన్నదెబ్బ తగిలితే రాఘవ విలవిలలాడిపోయేవాడు. కొడుకు ఓ పూట అన్నం తినకపోతే తనూ అన్నం తినేవాడు కాదు. అంతగా ప్రేమించిన కొడుకునీ, తల్లిదండ్రుల్ని కూడా కాదనుకుని పెళ్లి చేసుకున్న తనని వదిలి ఎలా వెళ్లగలిగాడు తన భర్త!

ఈ ప్రపంచంలో బంధాలకన్నా, డబ్బుకన్నా, అధికారం కన్నా బలమైనది విధి. అది బలమైనదే కాదు క్రూరమైనది కూడా!

బాధాకరమైన గతంకన్నా ముందున్న భవిష్యత్తు ఇంకా భయపెడుతోంది అరుంధతిని. రేపు ఎలా గడుస్తుంది? అనే ఆలోచనే ఆమె గుండెను చిత్రవధ చేస్తోంది.

''అరుంధతీ... నీకేమైనా మతిపోయిందా! బిడ్డని ఒళ్లో పెట్టుకుని ఏడవకూడదు. కళ్లు తుడుచుకో ముందు'' మందలింపుగా అన్నది ఇందిర.

''ఏడవక చేసేదేం ఉంది నాకు. ఈ పసివాడు ఏం చేశాడని దేవుడు వాడికి తండ్రి లేకుండా చేశాడు?'' దుఃఖంతో గొంతు పూడుకుపోయింది అరుంధతికి.

''నిజమే! దేవుడు నీకూ, నీ బిడ్డకీ అన్యాయమే చేశాడు. అలాగని జరిగినదాన్నే తలచుకొని ఏడుస్తూ కూర్చుంటావా? చావు పుట్టుకలు మన చేతిలో లేవు. మన చేతిలో లేనిదాని కోసం బాధపడే కన్నా మనం ఏం చెయ్యగలం అని ఆలోచించటమే మనం చెయ్యవలసిన పని. ముందు జరగాల్సినదాని గురించి ఆలోచించు''

''ఏం ఆలోచించను? మా అత్తగారూ, మరుదులూ ఆస్తిలో చిల్లిగవ్వ కూడా ఇవ్వం పొమ్మన్నారు. ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. ఇంటివాళ్లకి రెండునెలల అద్దె బాకీ''

''మరి ఇప్పుడేం చేస్తావు? పోనీ పుట్టింటికి వెళతావా? ఎంతయినా తల్లిదండ్రులు కదా... ఇంత కష్టంలో ఉన్న నిన్ను చూడకపోరు''

''ఒకసారి వాళ్లని కాదనుకుని వచ్చేశాక ఏ ముఖం పెట్టుకుని వెళ్లమంటావు?''

''అయితే ఇప్పుడేం చెయ్యదలచుకున్నావు? నీకోసం కాకపోయినా నీ కొడుకు భవిష్యత్తు కోసమైనా ఏదో ఒకటి చెయ్యక తప్పదు''

''ఏం చెయ్యమంటావు? నేను పెద్దగా చదువుకోలేదు. ఏ ఉద్యోగం చెయ్యడానికీ అర్హత లేనిదాన్ని'' నిరాశ ధ్వనించింది అరుంధతి గొంతులో.

''బతకడానికి ఉద్యోగమే చెయ్యాలా?''

''మరింకేం చెయ్యను? నలుగురిళ్లలో పాచిపని చేసుకుని బతకమంటావా?''

''తప్పనిసరి అయినప్పుడు అలా బతకడంలోనూ తప్పులేదు. కానీ నీవా పని చెయ్యలేవని నాకు తెలుసు. నువ్వేమనుకోనంటే ఓ మాట చెబుతా వింటావా?'' సాలోచనగా అన్నది ఇందిర.

''నీలాంటి మంచి స్నేహితురాలు చెబితే అది ఖచ్చితంగా నా మంచికోసమే. చెప్పు, నన్నేం చేయమంటావు?''

''నీకు పిండివంటలు చెయ్యడం బాగా వచ్చు కదా. జంతికలూ, చెక్కవడలూ తయారుచేయడంలో నీకున్న నైపుణ్యాన్నే నీ జీవనాధారంగా మార్చుకో. నువ్వు తయారుచేసిన పిండివంటలని షాపులకి ఇస్తుండు. విడిగా ఇంటింటికీ తిరిగి అమ్మినా బాగానే వుంటుంది''

''ఇందిరా... '' ఇందిర మాట పూర్తికాకుండానే బాధగా అన్నది అరుంధతి.

గతం ఆమె ముందు కదిలి పరిహసించినట్టయింది.

★ ★ ★

అరుంధతి, రాఘవలది ప్రేమ వివాహం. ఇద్దరి కులాలూ వేరు. తమకంటే తక్కువ కులం వాడిని ప్రేమించానని తెలిస్తే, తండ్రి రాఘవతో పెళ్లికి ఒప్పుకోడని ఇంట్లోవాళ్లకి చెప్పకుండా రాఘవతోపాటు వెళ్లిపోయింది అరుంధతి. డబ్బులేని అరుంధతిని తమ కోడలిగా చేసుకోవడం రాఘవ తల్లిదండ్రులకీ ఇష్టం లేదు. కానీ కొడుకు మొండితనం తెలిసినవాళ్లు కనుక ఆ పెళ్లికి ఒప్పుకోక తప్పలేదు. కులాలు వేరైనా రాఘవ అరుంధతిల వైవాహిక జీవితం ఆనందంగా ఏ కలతలూ రాకుండానే గడిచింది. వాళ్ల అనురాగానికి గుర్తుగా ఓ బిడ్డ కూడా పుట్టాడు వాళ్లకి.

★ ★ ★

ఓరోజు...

అయిదు నిమిషాల నుంచి కాలింగ్ బెల్ మోగుతూనే వుంది.

చేతిలో ఉన్న నవల టేబుల్ మీద పెట్టి అయిష్టంగానే లేచి వెళ్లింది అరుంధతి.

ఎదురుగా ఓ స్త్రీమూర్తి. దైన్యానికి ప్రతిరూపంలా ఉంది. వెలిసిపోయిన వాయిల్ చీర కట్టుకుంది. బక్కచిక్కిన శరీరం, లోతుకుపోయిన కళ్లు.. దరిద్రానికి ప్రతిబింబంలా ఉంది. ఆమె కొంగుపట్టుకుని నిలబడ్డ ఐదేళ్ల బాబు...

బరువైన సంచిని మోస్తూ ఎండలో నడిచి వస్తోందేమో, ఆయాసపడుతోంది.

కానీ అరుంధతి అదేం పట్టించుకునే స్థితిలో లేదు. మంచి రసపట్టులో ఉన్న నవల వదిలేసి వచ్చినందుకూ అందుకు కారణమైన ఆమె మీదా పీకల దాకా కోపం వచ్చింది.

''ఏం కావాలి?'' నొసలు చిట్లిస్తూ చిరాకు

నంతా మొహంలో ప్రదర్శిస్తూ అడిగింది.

''జంతికలూ, కజ్జికాయలూ, చెక్కవడలూ... ఇంకా చాలా రకాలున్నాయి. తీసుకుంటారామ్మా'' జీవంలేని నవ్వుతో దీనంగా అడిగింది ఆమె.

అరికాలి మంట నెత్తికెక్కింది అరుంధతికి.

''నేను పిలిచానా నిన్ను?'' తీక్షణంగా అడిగింది.

''లేదమ్మా! ఏమయినా కొంటారేమోనని...'' కొంటే బాగుండుననే ఆశతో అన్నది ఆమె.

''అందుకని కాలింగ్ బెల్ కొట్టి మరీ పిలవాలా? అసలీ కాలింగ్ బెల్ మీలాటివాళ్ల కోసమే పెట్టినట్టు. అడుక్కునేవాళ్లు కూడా కాలింగ్ బెల్ కొట్టి మరీ అడుక్కుంటున్నారు... నాకేం అక్కర్లేదు కానీ వెళ్లు...''

ఆ స్త్రీమూర్తి ముఖం నల్లగా అయిపోయింది ఆ అవమానానికి.

అయినా అవమానాలనీ, కన్నీళ్లనీ కూడా మింగేసే అవసరం ఆమెది.

''ఏమిటి అరుంధతీ ఏమిటి సంగతి?'' పక్కింటి మాలతి బయటకొచ్చింది.

''ఆ... ఏముందీ జంతికలూ, చేగోడీలూ చేశాను కొనమంటుంది'' హేళనగా నవ్వుతూ అంది అరుంధతి.

''ఇలా ఇళ్లకొచ్చేవాళ్లని నమ్మడానికి వీల్లేదు. పగలు ఇలా అమ్మే వంకతో వచ్చి ఇల్లూ వాకిలీ చూసుకుని వెళతారు. రాత్రిళ్లు వాళ్లే దొంగతనానికి వస్తారుట'' ఎక్కడో ఎవరో చెప్పింది విని ఇక్కడ అదే రికార్డు ప్లే చేసింది మాలతి.

''మేము అలాటివాళ్లం కాదమ్మా. ఈ వెనక వీధిలోనే ఉంటున్నాం. ఒకప్పుడు బాగా బతికినవాళ్లమేనమ్మా'' ఆమె సంచి తీసుకుని వెళ్లబోయింది.


''ఆగు... ఆగు... ఏదో మాటవరుసకన్నాను కానీ ఏమేం ఉన్నాయో చూడనీ..'' ఆమె సంచిలో చెయ్యిపెట్టి చొరవగా ఆ పాకెట్లని తీసి పరీక్షిస్తూ అన్నది మాలతి.

''ఇవన్నీ నువ్వే చేశావా?''

''నేనే చేశాను బాగుంటాయి తీసుకోండమ్మా''

''అలాగేలే, పాపం... ఇల్లిల్లూ తిరిగి అమ్మడం కష్టం కాదూ...'' లేని సానుభూతిని నటించింది మాలతి.

''ఇంతకీ మీ ఆయనేం చేస్తాడు?'' కాలక్షేపం కబుర్లంటే చెప్పలేనంత ఇష్టం మాలతికి. వినేవాళ్లుండాలే కానీ గంటల తరబడి పనికిరాని కబుర్లు చెబుతూనే వుంటుంది.



''ఆయన లేరమ్మా. జబ్బుచేసి పోయారు...'' కళ్లు తుడుచుకుందామె.

''అదన్నమాట సంగతి. నేను నిన్ను చూసినప్పుడే అనుకున్నా, ఏదో కష్టం ఉండబట్టిగానీ లేకపోతే ఇల్లిల్లూ తిరిగే అవసరం ఎందుకుంటుందా అని'' తనేదో గొప్ప విషయం కనిపెట్టినట్టుగా అన్నది సుజాత.

ఆమె మాట్లాడలేదు.

''రోజుకి ఎంత గిట్టుబాటు అవుతుందేమిటి?'' చేగోడీల పొట్లం అటూ ఇటూ తిప్పి చూస్తూ అన్నది మాలతి.

''ఏదో మీలాటివారు దయతలిస్తే ఓ పదీ పరక...''

చేతిలో చేగోడీల పొట్లం ఆమె సంచిలో పెట్టి నవ్వింది మాలతి.

''ఏమ్మా తీసుకోరా?''

''ఇలా ఇళ్లకొచ్చేవాళ్ల దగ్గర కొంటే మావారు అసలు తినరు. మేం ఏం కొన్నా పెద్ద షాపులోనే కొంటాం కాస్త ఖరీదెక్కువయినాసరే...'' గొప్పగా చెప్పింది మాలతి.


''మేమూ అంతే బాబూ'' తనూ మాలతికి ఏం తక్కువ కాదన్నట్టు నవ్వుతూ అన్నది అరుంధతి.

ఆరోజు సాయంత్రం ఇందిరతో కబుర్లు చెబుతున్నప్పుడు పొద్దుట జరిగిన సంగతి చెప్పింది అరుంధతి.

ఆదుర్తి బాల

అంతా విన్న ఇందిర నొచ్చుకుంది.

''ఏమయినా నువ్వు చేసింది చాలా తప్పు అరుంధతీ... నీకిష్టమైతే కొనుక్కోవాలి లేకపోతే మానెయ్యాలి కానీ ఆమెని అలా అవమానపరచడం భావ్యం కాదు''




''ఆమె చేసిన పని బాగుందా? కాలింగ్ బెల్ కొట్టి అమ్ముకోవాలా? ఏ రోడ్డు పక్కనో పెట్టి అమ్ముకోరాదూ''

''అమ్ముకోవచ్చు కానీ, ఇలా ఇంటింటికీ తిరిగి అమ్మితే ఎక్కువ అమ్ముడవచ్చని ఆమె ఉద్దేశం అయి వుండవచ్చు. ఎవరికి అనువైన రీతిలో వాళ్ళు వ్యాపారం చేసుకోడం తప్పా?''

''అయితే ఇలా తలుపుతట్టి డిస్టర్బ్ చేయవచ్చా?''

''అప్పుడు నువ్వేం చెప్పాలీ? ఇంకెప్పుడూ నా ఇంటి తలుపు కొట్టొద్దు, నేను నీ దగ్గర కొనం



క్కోను అని చెప్పాలికానీ అవమానపరచడం గొప్ప అనుకుంటున్నావా? అయినా ఆర్థికంగా మనకన్నా ఓ స్థాయి తక్కువ ఉన్నంతమాత్రాన వాళ్లనలా హేళన చేసే హక్కు లేదు మనకి. అయినా దొంగతనం చెయ్యడం కన్నా, ఒకళ్లని మోసం చెయ్యడం కన్నా, బిచ్చమెత్తుకోవడం కన్నా ఇది మంచి పనేగా'' సీరియస్‌గా అన్నది ఇందిర.

''అబ్బా ఆపు తల్లీ... అసలు నీతో ఈ సంగతిని చెప్పి పొరపాటు చేశాను'' విసుగ్గా అన్నది అరుంధతి.

''నా మాటలు అర్థం చేసుకోకపోతే నీకు విసుగ్గానే ఉంటాయిలే'' నిట్టూరుస్తూ అన్నది ఇందిర.

★ ★ ★

''ఏమిటే ఆలోచిస్తున్నావు?'' అరుంధతిని కుదుపుతూ అడిగింది ఇందిర.

''ఆలోచించడం లేదు, గుర్తుచేసుకుంటున్నాను. తెలిసో తెలియకో ఆమెని బాధపెట్టాను. ఆరోజు మేం అన్న మాటలకి ఆమె ఎంత అవమానపడిందో నాకిప్పటికీ గుర్తుంది. అందుకే దేవుడు నాకు తగిన శిక్ష వేశాడు'' బాధగా అన్నది అరుంధతి.

''పోనీలేవే... ఊరుకో ఇప్పటికైనా నిజం తెలుసుకున్నావు. ఇలా ఇళ్లకి వచ్చి అవీ ఇవీ అమ్మేవాళ్లంటే నీకెంత చిన్నచూపో నాకు తెలుసు. కానీ వాళ్లని ఆ పనికి పురిగొల్పిన పరిస్థితుల గురించి ఆలోచించావా ఎప్పుడైనా? డెబ్బయ్యో పడిలో పడుతున్నా ఇంటి దగ్గర పచ్చళ్లు చేసి అమ్మే మామ్మగార్లూ, చదువులేక బిడ్డల్ని పోషించుకునే వేరే మార్గం లేక తినుబండారాలు చేసి ఇంటింటికీ తిరిగే నడివయసు స్త్రీలూ... వీళ్లంతా ఈ పనులు సరదాకోసమో, హాబీగానో చేయటం లేదు. బ్రతుకుతెరువు కోసం తప్పనిసరై ఎంచుకున్న మార్గాలివన్నీ. కాబట్టి వాళ్లని చిన్నచూపు చూడకూడదు. ఒకరిని మోసం చేయనంతవరకూ, దొంగతనం చేసి సంపాదించనంతవరకూ ఏ పనిచేసినా తప్పు లేదు. మనిషి తనకున్న అవకాశాలనీ, అర్హతలనీబట్టి పొట్టపోసుకోడానికి తనకనువైన మార్గాలను ఎంచుకుంటాడు. మనం చేసే పని ఏదయినా దానిమీద గౌరవం, అంకితభావం ఉన్నప్పుడు అది మనిషికి డబ్బుతోపాటు తృప్తినీ మిగులుస్తుంది. అర్థం పర్థంలేని భేషజాలు కడుపు నింపలేవు'' చెప్పడం పూర్తయ్యాక గట్టిగా ఊపిరి పీల్చుకుంది ఇందిర.

''నీ మాటలు నా కళ్లు తెరిపించాయి. నా బిడ్డ బంగారు భవిష్యత్తు నా చేతుల్లో ఉందిప్పుడు. వాళ్ల నాన్న కోరుకున్నట్టు వాడిని పెద్ద చదువులు చదివిస్తాను. వాడికి జన్మనిచ్చినందుకు, మంచి జీవితాన్నివ్వడం కూడా నా బాధ్యత. నాకు వచ్చిన పనినే నా బ్రతుకుతెరువుగా చేసుకుంటాను'' స్థిరంగా అన్నది అరుంధతి.

''ఇప్పటికి దారికొచ్చావు. నీ వ్యాపారానికి పెట్టుబడి నేనిస్తాను. తర్వాత నెమ్మదిగా తీరుద్దువు గానీ...'' అరుంధతి భుజం తడుతూ అన్నది ఇందిర.

''నీ మేలు జన్మజన్మలకీ మరచిపోను...'' ఆప్యాయంగా ఇందిర చేయి నొక్కుతూ అన్నది అరుంధతి.

నోరూరించే రకరకాల పిండివంటలు చేసి నీట్‌గా ప్యాక్ చేసి సంచి నిండా సర్దుకుంది అరుంధతి. తను ఈ వ్యాపారంలో బాగా పైకి రావాలనీ, పెద్ద షాపు ఓపెన్ చేసి తనద్వారా కొంతమందికైనా జీవనోపాధి కల్పించాలనే ఆత్మవిశ్వాసంతో ముందుడుగు వేసింది అరుంధతి. ✪

## కాశ్మీరా కొత్త ఫ్రెండ్

**కాశ్మీరా షా గుర్తుందా? ఈమధ్య సినిమాల్లో కాస్త వేషాలు తగ్గాయిలెండి. లేటెస్టుగా బ్రాడ్ అనే బాయ్‌ఫ్రెండ్‌ని చూసుకుందిట. అది కూడా ఎక్కడనుకుంటున్నారూ... అమెరికాలో! ఈ రకంగా మళ్లీ వార్తల్లోకి వస్తోంది!**

-ప్రియ